క్లుప్తంగా

గొడుగుల పంపిణీ

కడప కల్చరల్ : తుపాను కారణంగా వర్షం కురుస్తుండడంతో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో గొడుగులను పంపిణీ చేశారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సంస్థ కార్యాలయం వద్ద అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, ఇతర సభ్యులు రంగ, శ్రీనివాసులురెడ్డి దారిన తడుస్తూ వెళుతున్న పేదలను పిలిచి గొడుగులను అందజేశారు. దీంతో పేదలు సంతోషం వ్యక్తం చేశారు.

అన్నదానం

కడప కార్పొరేషన్: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శ్రీ సాయి యువజన సేవా సంఘం అధ్యక్షులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సెంట్రల్ జైలు సమీపంలోని శ్రీ చౌడమ్మ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇందుకు సహకరించిన తిరుమల టింబర్ డిపో అధినేత కె. గోపీక్రిష్ణ, సూర్య డెవలపర్స్ అధినేత కె. సురేంద్రనాథ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ రంగంలో పని చేస్తున్న కార్మికులకు ఆప్కాస్ విధానంలో ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కెసీ బాదుల్లా, ఏఐటీయూసీ నాయకులు మద్దిలేటి, గోవిందు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు కడప విద్యార్థులు

కడప స్పోర్ట్స్: కడప మున్సిపల్ హైస్కూల్ (మెయిన్) విద్యార్థులు జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 24 నుంచి 26వ తేదీ వరకు మన్యం జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17, అండర్-19 విభాగంలో వైఎస్ఆర్ కడప జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పాఠశాల విద్యార్థులు బి.వి.ఎన్. జశ్వంత్, ఎం. సతీష్‌కుమార్ (రికర్వ్ అండర్-19 విభాగం), సి. లోకేష్ (అండర్-17 విభాగం)లు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 9 నుంచి గుజరాత్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని నగర కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్‌చంద్ అభినందించారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలో యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఇన్‌ఛార్జి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ స్కిల్స్, ట్యాలీ, రీటైల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వివరాలకు 90004 87423 సంప్రదించాలన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్: విద్యా, ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రమణ, ఎజాజ్ అహ్మద్, చంద్రశేఖర్, జువేద్, వెంకటసుబ్బయ్య, ప్రభాకర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక గురుకుల పాఠశాలలో మంగళవారం వికలాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేయడానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వికలాంగులకు ఈ ట్రై సైకిల్స్ అందిస్తున్నామని ఆమె అందులో పేర్కొన్నారు. వికలాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో వెంట తీసుకు రావాలని ఆమె తెలిపారు.

నేడు కార్యకర్తల సమావేశం

వీరపునాయునిపల్లె : మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల స్థాయి నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కల్లూరు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఘనంగా గోవిందుని కళ్యాణోత్సవం

– నగరంలో వైభవంగా శోభాయాత్ర

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన గోవింద మాల దీక్షలోని భక్తులు సోమవారం నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో గురువారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోవిందమాల భక్త బృందం సంస్థ ఏర్పాటు చేసిన ఈ కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయం నుంచి ధర్మకర్త డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 108 మంది ముత్తయిదువులు పుణ్యజలాలుగల కలశాలను ధరించి ఊరేగింపుగా కళాక్షేత్రానికి బయలుదేరారు. అశ్వాలు, అలంకరించిన రథంలో శ్రీ వెంకటేశ్వరస్వామి, పద్మావతి మాతలను కొలువుదీర్చారు. రథాన్ని లాగుతూ స్వామి గురించిన పాటలను ఆలపిస్తూ మంగళ వాయిద్యాల మధ్య ఆర్టీసీ బస్టాండు, కోటిరెడ్డిసర్కిల్, ఏడురోడ్ల కూడలి మీదుగా కళాక్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అర్చకుల బృందం వేదికపై దేవతామూర్తులకు సుప్రభాతసేవ, విశ్వరూప దర్శనం, బాల భోగ ప్రథమ ఆరాధన, పలు అలంకారాలు నిర్వహించారు. మహిళా భక్తులు తెచ్చిన 108 కలశాలలోని పుణ్య జలాలు, సుగంధ ద్రవ్యాలతో దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని వధూవరులుగా అలంకరించి వేదికపైగల పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. పలు పూజల అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. నగరానికి చెందిన భక్తులు, గోవిందమాల ధరించిన భక్తులు, నగర ప్రముఖులు విశేష సంఖ్యలో హాజరై కల్యాణ మూర్తులను దర్శించుకున్నారు. మహిళా భక్తులు భక్తిగీతాలకు కోలాటాలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. నిర్వాహకులు భక్తులందరికీ మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించారు.





శోభాయాత్రలో కలశాలతో మహిళలు
(ఇన్‌సెట్) కల్యాణఘట్టంలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఘనంగా కార్తీక మాస పూజలు



కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఊటుకూరులో ప్రత్యేక అలంకరణలో శివుడు

కడప కల్చరల్ / కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్తీక మాసం మూడవ సోమవారం శివయ్యకు ఘనంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఓవైపు సన్నగా వాన కురుస్తున్నా నిలిచిన సమయంలో వచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలలో కార్తీక దీపాలు పెట్టి తమ కుటుంబాలను చల్లగా చూడాలని మొక్కుకున్నారు. నగరంలో తెల్లవారుజామున దాదాపు రెండు గంటలపాటు జల్లులు ఆగిపోవడంతో మొక్కులు గల భక్తులు ఆలయాలకు తరలివెళ్లి కార్తీక దీపాలు వెలిగించారు. సాయంత్రం వెలిగించాలనుకున్న వారు సన్నగా వర్షం కురుస్తుండడంతో ఒకింత నిరాశకు గురైె వర్షం కురవని చోట దీపాలు పెట్టి తృప్తి పడ్డారు. కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం, మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వర స్వామి ఆలయం, నబీకోట శివాలయం, దేవుని కడప శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం, గడ్డిబజారు శివాలయంలో కూడా విశేష అభిషేకాలు, సాయంత్రం ఆకాశ దీపార్చన నిర్వహించారు.

– నగర శివార్లలోని ఊటుకూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ఆవరణంలోని శివాలయంలో మూడవ కార్తీక సోమవారం సందర్భంగా శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



కడప కల్చరల్: విశేష అలంకారంలో శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి

జడివాన

కడప కార్పొరేషన్ / కడప కోటిరెడ్డి సర్కిల్: తుపాను నేపథ్యంలో కడప నగరంలో భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. చల్లని ఈదురు గాలులు, చిరుజల్లులతో వర్షం ప్రారంభమైంది. మెల్లగా మొదలైన వాన జడివానగా మారింది. మధ్యాహ్నం నుంచి కొద్దిసేపు కూడా విరామం లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఫలితంగా నగరంలో ఎస్‌బీఐ కాలనీ, గంజికుంట కాలనీ, తిలక్‌నగర్, శాంతినగర్, వరదకాలనీ, రామక్రిష్ణ నగర్, ప్రకాష్ నగర్, ఓంశాంతినగర్, నిరంజన్ నగర్, బుడగజంగం కాలనీ, రామరాజుపల్లె, నంద్యాల నాగిరెడ్డి కాలనీ, చెంచు కాలనీ, ఖలీల్ నగర్ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లాయి. రహదారులపై వరదనీరు నిలిచింది. మట్టిరోడ్లు బురదమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో చాలా ఇళ్లలోకి నీరు చేరింది. చలిగాలి వీచడం, వాన పడుతుండటంతో ప్రజలు బయటికి రావడానికి ఇబ్బంది పడ్డారు. ఫుట్‌పాత్, వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం వల్ల పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

– తుపాను ప్రభావంతో కడప నగరంలో కురుస్తున్న వర్షం కారణంగా ఆర్టీసీ బస్టాండు ఆవరణలో వర్షపు నీరు నిలిచింది. ఈ కారణంగా వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండుకు వచ్చిన ప్రయాణీకులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కడప బస్టాండుకు చేరుకున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే ఆర్టీసీ గ్యారేజీలో కూడా వర్షపు నీరు నిలబడడంతో కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులను పూర్తిచేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో నూతనంగా నిర్మితమవుతున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం పుట్లంపల్లి, ఉక్కాయపల్లె, వినాయక నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పనులలో ఎక్కడా నాణ్యత లోపాలు లేకుండా చూసుకోవాలని, డిసెంబర్ రెండో వారం లోగా పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉక్కాయపల్లి ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వెళ్లే వాహనాలకు రూట్ మ్యాప్ ఏర్పాటు చేయాలని, ప్రతి ఒక్క క్లాప్ వాహనం మొదట ఇంటి వద్ద ఉదయం ఆరు గంటలకు చెత్త సేకరణ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం నివాస గృహాల నుంచి చెత్త స్వీకరణ చేసి, సాయంత్రం వేళ కమర్షియల్ వ్యాపారస్తుల వద్ద చెత్తను స్వీకరించేలా తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాల్సిందిగా శానిటేషన్ విభాగ అధికారులకు ఆదేశించారు.



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలన్నీ సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

– జేసీ గణేష్ కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రతి సోమవారం ‘స్పందన’ కార్యక్రమంతో పాటు మండల స్థాయిలో నిర్వహిస్తున్న ‘జగనన్నకు చెబుదాం’ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జేసీ జి.గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ‘స్పందన’ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదులను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించి పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, ఎస్డీసీ రామ్మోహన్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డీఆర్డీఏ, డ్వామా పీడీలు ఆనంద్ నాయక్, యదుభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ గణేష్‌కుమార్

పొలతలలో భక్తజనం



పొలతలలో శ్రీమల్లేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులు

పెండ్లిమర్రి : జిల్లాలో ప్రసిద్ధి పొందిన శైవక్షేత్రాలల్లో ఒక్కటైన పొలతల క్షేత్రానికి మూడవ కార్తీక సోమవారం భక్తులు జిల్లా నలుమూల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

– పొలతల క్షేత్రంలోని మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవారిని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి, అరుణమ్మ దంపతులు, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డిలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారిని ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు సాదరంగా ఆహ్వానించారు.

కల్యాణం.. కమనీయం

మూడవ కార్తీక సోమవారం సందర్భంగా శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవారి కల్యాణం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. ముందుగా కల్యాణానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, అరుణమ్మ దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుక వచ్చారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్నారు. కల్యాణాన్ని తిలకించడానికి జిల్లా నలుమూల నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి కన్నులారా తిలకించారు.

పరమత సహనాన్ని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కడప ఆర్డీఓ మధుసూదన్

– ప్రజలకు కడప ఆర్డీఓ వినతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ ఎదుటి వారి మత విశ్వాసాన్ని గౌరవిస్తూ పరమత సహనాన్ని పాటించాలని కడప ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. సోమవారం కడప నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో వివిధ మతాలకు చెందిన వారితో ఆర్డీఓ పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ కడప నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ వస్తోందన్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలని, పుకార్లను నమ్మరాదని సూచించారు. నగరంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా మత పెద్దలు, ప్రజలు సంబంధిత అధికారులను సంప్రదించి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు. స్థానిక సమస్యలతోపాటు నగరంలో నిర్మించనున్న కొన్ని ముఖ్య కూడళ్లపై వచ్చిన అభియోగాలు, అనుమానాలపై ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ, డీఎస్పీలు నివృత్తి చేశారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సీఐ, ఎస్ఐలతోపాటు నగర ప్రముఖులు షఫీ, సయ్యద్ సలావుద్దీన్, పెద్దదర్గా ముజావర్ అమీర్, బాలకృష్ణ యాదవ్, లక్ష్మణ్‌రావు, లక్ష్మినారాయణరెడ్డి, మునగా సతీష్, చలపతి, లక్ష్మణరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధగురుస్వామి ఆరాధన

పెండ్లిమర్రి : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ జగద్గురు సిద్ధగురుస్వామి ఆరాధన ఉత్సవాలు మూడవ కార్తీక సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, కుంకుమార్చన, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాయ కర్పూరాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ఆలయ ఆవరణలో నిర్వాహకులు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఏడు జతల ఎద్లు పాల్గొన్నాయి. పోటీలను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ముందుగా వారు సిద్ధగురుస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి.

మానవత్వం చాటిన డీఎస్పీ

కడప అర్బన్: కడప నగరంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో అసహాయ స్థితిలో వున్న ఓ వృద్ధురాలిని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ గమనించారు. చలితో వణుకుతున్న ఆమెకు వెంటనే స్వెటర్‌ను, బెడ్‌షీట్‌ను తెప్పించి ఇచ్చారు. ఆమె వాటిని స్వీకరించి డీఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ సమయంలో కడప తహశీల్దార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

దళిత ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్

కడప ఎడ్యుకేషన్: దళిత ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధే ఏపీ మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్(మేడ్) లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ అన్నారు. సోమవారం కడపలోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రాంగణంలో మేడ్ జిల్లా సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు సంబటూరు రవీంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని దళిత ఉద్యోగుల సంక్షేమం, ఐక్యత, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. దళిత ఉద్యోగులందరూ అంబేద్కర్ భావజాలంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కమలాపురపు బాలరాజును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, వెంకటసుబ్బయ్యను గౌరవ సలహాదారుగా ఎంపిక చేయడంతోపాటు నూతన జిల్లా, నియోజకవర్గ కమిటీని ఎంపిక చేశారు. ఇందులో కడప జిల్లా అధ్యక్షుడిగా సంబటూరు రవీంద్రబాబును, ప్రధాన కార్యదర్శిగా చల్లపు రాజారావు, కడప నియోజకవర్గ అధ్యక్షుడిగా చాట్ల బాలరాజును ఎన్నుకున్నారు. వీరితోపాటు అన్ని నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మేడ్ నాయకులు పాల్గొన్నారు.

ఘంటశాలకు ఘన నివాళి

కడప ఎడ్యుకేషన్: గొప్ప గాయకుడు ఘంటశాల వెంకటేశ్వరరావు అని కడప డీసీసీ బ్యాంకు ఓఎస్‌డీ గురప్ప అన్నారు. ఘంటశాల జయంతిని పురస్కరించుకుని సోమవారం కడపలోని కోఆపరేటివ్ కాలనీ నెహ్రూపార్కు వద్ద ఉన్న ఘంటశాల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటశాల తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం , హిందీ తదితర భాషల్లో 10 వేలకు పైగా పాటలు పాడిన మహానుభావుడన్నారు.

చర్చి స్థలాన్ని కాపాడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలో సర్వే నెంబరు 158/5ఏలో 45 సెంట్లలో ఉన్న చర్చి స్థలాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రెవరెండ్ మల్లెం విజయభాస్కర్, షమ్మ మినిస్ట్రీ అధ్యక్షురాలు అమ్ములు కోరారు. ఈ మేరకు సోమవారం వారు స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ చర్చి స్థలంలో గత 10 సంవత్సరాల నుండి విశ్వాసులు ప్రార్థనలు చేసుకుంటున్నారని తెలిపారు. ఎద్దుల పుష్పరాజు 2015వ సంవత్సరంలో చర్చి నిర్మించుకునేందుకు దానవిక్రయం కింద స్థలాన్ని అందజేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని పుష్పరాజు అన్నదమ్ములు ప్రస్తుతం దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈవిషయంగా ఇప్పటికే ఎస్పీ, కలెక్టర్‌లకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. జేసీని కలిసిన వారిలో ఏపీపీఎఫ్ నగర అధ్యక్షులు పాస్టర్ సుధీర్ కుమార్, ఏపీపీఎస్ సెక్రెటరీ పాస్టర్ డేవిడ్ రాజ్, రాజకుమారి, భారతి, శేఖర్, ప్రదీప్, రమేష్, మధు, సురేష్‌లు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

– జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్



మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. సోమవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయసేవాసదన్‌లో న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్‌లతో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. అరెస్ట్, ప్రీ అరెస్ట్, రిమాండ్ స్టేజ్ అంశాలపై అవగాహన పెంచుకోవాలని జడ్జి పేర్కొన్నారు. పోలీసులు ఏ విషయంలో దర్యాప్తు కోసం పిలిచారో తెలుసుకునే హక్కు ఉందన్నారు. పోలీసులు మిమ్మల్ని ప్రశ్నించినపుడు వకీలును పెట్టుకునే హక్కు మీకుందన్నారు. మీ దగ్గరలోని న్యాయ సేవాధికార సంస్థ నుంచి ఉచిత న్యాయసహాయాన్ని పొందవచ్చునన్నారు. బెయిల్ కోరే హక్కు మీకుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, ప్యానల్ న్యాయవాదులు, పోలీసులు, పారా లీగల్ వాలంటీర్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వాలు దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకుడు సింగారెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో వేడుకలు నిర్వహిచారు. అనంతరం వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు చిన్న సుబ్బయ్య యాదవ్ పలువురికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘ నాయకులు మాతయ్య, ఆంజనేయులు, ప్రసాద్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రమాదకరమైన చట్టాన్ని రద్దు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో ప్రభుత్వం ఏకపక్షంగా అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ భూమి హక్కు 2022 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ కోరారు. సోమవారం ఆ మేరకు ఆయన కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ప్రజలు దీనిపై ప్రతిఘటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శివ , సుబ్రహ్మణ్యం, కెనడి , శ్రీనివాసులు ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.